నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

తేలిన మోటర్లు

- వట్టెం పంపుహౌస్‌లో డీవాటరింగ్ పూర్తి
- మోటర్లను శుభ్రం చేయిస్తున్న అధికారులు
- 19 కిలోమీటర్ల మేర టన్నెల్‌లో నిలిచిన నీళ్లు
- తోడివేతకు మరో రెండు వారాలు పట్టే అవకాశం



నీటి తోడివేతతో వట్టెం పంప్‌హౌస్‌లో బయటపడిన మోటర్లు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెంలో నిర్మించిన వెంకట్రాది రిజర్వాయర్ మోటర్లు నీటిలో నుంచి తేలాయి. ఈనెల మొదటి వారంలో భారీ వర్షాలతో అడిట్‌ల గుండా వరద జలాలు ప్రవేశించడంతో పంపుహౌస్ మునిగిపోయింది. దీంతో అప్పటి నుంచి 30 ఫీట్లకు పైగా లోతులో రూ.2,600 కోట్ల విలువైన మోటర్లు నీటిలోనే ఉంటూ వచ్చాయి. అప్పటి నుంచి నీటి తోడివేతను ఇరిగేషన్ ఇంజినీర్లు చేపడుతున్నారు. మోటర్ల మునకపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిలు విమర్శించారు. దీంతో స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి వారం కిందట మునిగిన పంపుహౌస్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో 40 మోటర్లతో 20 రోజులకుపైగా నీళ్లను ఎత్తిపోయడం జరిగింది. ముందుగా సర్జిపూల్ నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు వెళ్లకుండా షట్టర్లను మూసేశారు. కొందరు గజ ఈతగాళ్ల సాయంతో షట్టర్లలో నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు రాకుండా చేశారు. ఎట్టకేలకు ఈ మోటర్లు బయటకు తేలాయి. అయితే శ్రీపురం నుంచి పంపుహౌస్ వరకు 19 కిలోమీటర్ల మేరకున్న టన్నెల్‌లో నీళ్లు నిలిచి ఉన్నాయి. ప్రస్తుతం తేలిన మోటర్లను శుభ్రం చేయిస్తున్నారు. మోటర్లు, స్విచ్ బోర్డులను తిరిగి ఎప్పటిలాగే పని చేసేలా పనులు చేస్తున్నామని, చిన్నచిన్న మరమ్మతులు తప్పా పెద్దగా నష్టం కలగలేదని ఈఈ పార్థసారథి తెలిపారు. 15రోజుల్లో మోటర్లను శుభ్రపర్చే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అయితే టన్నెల్‌లో నీళ్ల తోడివేత ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంది. ఈ తోడివేతకూ పక్షం రోజులు పట్టే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఈ నిర్లక్ష్యానికి కారణమైన ఏజెన్సీ, అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం తరపున ఎలాంటి చర్యలు తీసుకొనే పరిస్థితులు కనిపించడం లేదు. దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల్లో బాధ్య తాలాహిత్యం స్పష్టంగా కనిపించినా చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంలో అర్థమేంటనే సందేహాలు తలెత్తుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో ప్రారంభం కావాల్సిన వట్టెం రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో పడటమే కాకుండా, ఇలా పంపుహౌస్ ముంపునకు గల కారణాలపై రెండు రోజుల కిందట ఉమ్మడి పాలమూరు పర్యటన చేపట్టిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం ఇక్కడికి రాక పోవడంపై రైతుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలకమైన వట్టెం పంపుహౌస్ మునిగితే ముందుగా ఇక్కడ పరిశీలించాల్సింది పోయి అన్నింటినీ హెలీక్యాప్టర్ వేగంతో పరిశీలించిన ఈ బృందం వట్టెంకు రాక పోవడంలో ప్రాజెక్టుపై బాధ్యతారాహిత్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాగా, పంపుహౌస్‌లో మోటర్లు తేలడంతో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి గురువారం ఉదయం పరిశీలించారు. నీటి తోడివేత, మోటర్ల పరిశుభ్రతకు చేపట్టిన చర్యలను ఈఈని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మోటర్లకు ఎలాంటి నష్టం కలగలేదని మీడియాకు వివరించారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- బస్సు పుట్‌బోర్డుపై విద్యార్థులు

గ్రామీణం నుంచి పట్టణ ప్రాంతాలకు విద్యనభ్యసించేందుకు వచ్చే విద్యార్థులు అరకొర బస్సులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు బస్సుల సంఖ్యను తగ్గించడంతో విద్యార్థులు పట్టణ ప్రాంతాలకు రావడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం మక్తల్ నుంచి ముష్టిపల్లికి వెళ్లే బస్సులో తిరుగు ప్రయాణంలో విద్యార్థులు ఇలా ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా వెళ్తుండగా.. 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి తన కెమెరాలో బంధించారు.

– మక్తల్, సెప్టెంబర్ 26

అవగాహన కల్పిస్తున్న కేజే రెడ్డి

వైద్య విజ్ఞానంపై అవగాహన ఉండాలి

- ఎస్‌వీఎస్ దవాఖాన, మెడికల్ కళాశాల డైరెక్టర్ కేజే రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 : వైద్య విజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌వీఎస్ దవాఖాన, మెడికల్ కళాశాల డైరెక్టర్ కేజే రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సును విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల స్థాపించి 25ఏండ్లు పూర్తయిన సందర్భంగా వైద్య విద్యార్థులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందితో కలిసి వైద్య విజ్ఞానం కోసం 2వేల స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాలోని 60వేల మందికి పైగా విద్యార్థులు వచ్చారని తెలిపారు. రాష్ట్రంలోనే ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాల తర్వాత ఎస్‌వీఎస్‌లో ఎంబీబీఎస్ చేసేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల రాష్ట్రంలో మూడో స్థానంలో గుర్తింపు సాధించిందన్నారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ జోషి, దవాఖాన రెసిడెన్సీ డైరెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

2022-23 వానకాలంలో..

2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి 68 వేల టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిల్లర్ల నుంచి రావాలి. ఇందులో కేవలం 28 వేల టన్నుల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి చేరాయి. ఇంకా 40 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సీజన్‌లో 82 మిల్లులు డీఫాల్ట్ కిందకి రాగా, కేవలం 5 మిల్లులు మాత్రమే క్లియరెన్స్ పొందాయి. దీంతో మిల్లర్ల బకాయిని క్లియర్ చేయడం కోసం ఇచ్చిన గడువు చివరి దశకు చేరుకున్నది. అయినా బకాయిలు మాత్రం అలాగే ఉన్నాయి. ఈనెల 27న (శుక్రవారం) అంటే ఈరోజు వరకు ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఈ బకాయిని పూర్తి చేసేందుకు గడువు విధించింది.

పక్కదారి పట్టడంతోనే..

ప్రతి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తూ వస్తున్నది. మిల్లర్ల యజమానులు ఇతర రాష్ట్రాలకు బియ్యాన్ని తరలించి రూ.కోట్ల సొమ్మును మూటగట్టుకున్నారు. మిల్లర్ల వ్యవహారాన్ని గత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఏటా పెండింగ్ పెరుగుతూ వచ్చింది. మిల్లుల్లో జరుగుతున్న తతంగమంతా తెలిసినా పట్టించుకోకపోవడంతో నేడు బకాయి పెరడగానికి కారణంగా చెప్పొచ్చు. ఇందులో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. చివరకు ఆలస్యంగా మేల్కొని మిల్లులపై దాడులు చేస్తున్నా.. ప్రయోజనం లేకుండా పోతున్నది. కొద్దిమేర మాత్రమే వసూలు కావడం.. పెద్ద మొత్తంలో బకాయి పెండింగ్‌లోనే ఉండడంతో అధికార యంత్రాంగానికి పెను సవాలుగా నిలుస్తున్నది. ప్రజల సొమ్ము పరులపాలు అన్నట్లు రైస్ మిల్లర్లు దర్జాగా ధాన్యం బస్తాలను లూటీ చేసినా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితులు వచ్చాయన్న విమర్శలున్నాయి.

వనపర్తి జిల్లాలోని రైస్‌మిల్లులో దాడులు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం (ఫైల్)

రైస్ మిల్లర్ల దొంగాట!

- గడువు సమీపించినా ససేమిరా..
- సీఎంఆర్ ఇవ్వడంపై మిల్లర్ల పేచీ
- చర్యలు తీసుకుంటున్నా చలనం కరువు
- మూడు సీజన్లకు లక్షా 68 వేల ఎంటీల బియ్యం బకాయి
- 2022-23 వానకాలానికి నేడు ఆఖరి గడువు
- 2023-24 వానకాలం, యాసంగికి ఈనెల 30వ తేదీ డెడ్‌లైన్

వనపర్తి, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మిల్లర్లకు ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ (కస్టమ్స్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన చర్యల్లో మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. బకాయి ఉన్న మిల్లులపై చర్యలు తీసుకుంటున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. మూడు సీజన్లకు సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లర్లకు ఇచ్చిన గడువు ముగుస్తున్నా.. రావాల్సిన బియ్యం కేటాయింపులు రాక పోవడంతో సమస్య జఠిలమవుతుంది. వనపర్తి జిల్లాలో మొత్తం 172 రైస్ మిల్లులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టి స్వన్న మిల్లులే అధికంగా ఉన్నాయి. ఏటా సీజన్‌లో వడ్లు తీసుకొని బియ్యం నిల్వలను ప్రభుత్వానికి ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. సామ, దాన, దండోపాయాలు ఎన్ని ప్రయోగించినా ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం మాత్రం మిల్లర్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో మర ఆడించి 67 శాతం బియ్యం ఇవ్వాలి. ఇప్పటికీ ఎన్నో సార్లు ఇచ్చినా గడువు లన్నింటినీ మిల్లర్లు తుంగలో తొక్కుతున్నారు. జిల్లాలో మూడు సీజన్లకు సంబంధించి లక్షా 68 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉన్నది.

2023-24 వానకాలంలో..

2023-24కు సంబంధించి వానకాలంలో 1.91లక్షల టన్నుల ధాన్యాన్ని 82 మిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. వీటికి సంబంధించి లక్షా 28 వేల బియ్యం మిల్లర్ల నుంచి రావాలి. కేవలం 48 వేల టన్నులు మాత్రమే వచ్చాయి. ఇంకా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వానికి మిల్లర్ల ఇవ్వాల్సి ఉన్నది. వీటికి సంబంధించి అనేక మిల్లుల్లో వడ్ల నిల్వలు లేక పోవడంతో గడువులోపు బియ్యం కేటాయింపులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఈనెల 30ని చివరి గడువుగా ప్రకటించింది.

2023-24 యాసంగిలో..

2023-24 యాసంగికి సంబంధించి కేవలం 27 మిల్లులకు మాత్రమే ప్రభుత్వం వడ్లను కేటాయించింది. మిగిలిన మిల్లులన్నీ డీఫాల్టర్ కిందకి రావడంతో సక్రమంగా ఉన్న మిల్లులకే అన్నట్లు ఈ కేటాయింపులు జరిగింది. ఈ మిల్లుల యజమానులు కూడా బియ్యం కేటాయింపులు చేయకుండా మొండికేశారు. ఈ సీజన్‌లో 61వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాలి. కేవలం 12,500 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 48 వేల మెట్రిక్ టన్నులకుపైగా మిల్లర్లు బకాయి పడ్డారు. ఇలా ఈ సీజన్‌లోని బకాయి ఉన్న బియ్యాన్ని ఇచ్చేందుకు సైతం ఈనెల 30వ తేదీని చివరిగా ప్రకటించింది. దీంతో ఒక సీజన్‌కు ఈ రోజుతో గడువు ముగుస్తుండగా, మిగిలిన రెండు సీజన్ల బియ్యానికి మరో మూడ్రోజులు మాత్రమే గడువు మిగిలి ఉన్నది. ఈలోగా బకాయి క్లియరెన్స్ అవుతుందన్న నమ్మకం మాత్రం మిల్లర్లపై రావడం లేదు.

> **గడువు ముగుస్తుంది..**
>
> సీఎంఆర్ బియ్యం ఇవ్వని మిల్లర్లకు ఇచ్చిన గడువు ముగుస్తున్నది. 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించిన బకాయి చెల్లించేందుకు నేడు చివరి గడువు. ఇంకా 2023-24 వానకాలం, యాసంగిలోనూ బకాయి ఉన్న మిల్లులకు 30వరకు గడువు మిగిలి ఉన్నది. అప్పటి వరకు ఈ బకాయిలను చెల్లించని పక్షంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. మిల్లర్ల నుంచి సీఎంఆర్ బకాయికి సంబంధించిన వసూళ్ల కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
>
> *- ఇర్ఫాన్, డీఎస్‌వో, వనపర్తి*

పర్యాటక హబ్‌గా పాలమూరు

- కేసీఆర్ ప్రభుత్వంలో పరిఢవిల్లిన టూరిజం
- సందర్శకులను ఆకర్షించేలా ఎంతో అభివృద్ధి
- తలమానికంగా నిర్మాణాలు
- ప్రస్తుతం పనులపై నీలినీడలు
- పలు చోట్ల ఎక్కడికక్కడే నిలిచిన వైనం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సస్పెన్షన్ బ్రిడ్జి (ఫైల్)

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 : ఏ ప్రాంత అభివృద్ధిలో నైనా పర్యాటక కేంద్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. టూరిజం ద్వారా వచ్చే ఆదాయాలు, పర్యాటక క్షేత్రాల ద్వారా వచ్చే పేరు ప్రతిష్టలు, తద్వారా ప్రపంచ స్థాయిలో ఆ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు నిస్తాయి. ఒకప్పుడు వలసలకు కేరాఫ్‌గా నిలిచినా పాలమూరు జిల్లా ఇప్పుడు పర్యాటకంగా విశేషంగా ఆకర్షిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం, జిల్లాల విభజన అనంతరం టూరిజం అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నది. శిల్పారామం, మినీట్యాంక్ బండ్, సస్పెన్షన్ బ్రిడ్జి, కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు, ఆడ్వెంచర్ల విన్యాసాలు, ఆకట్టుకునే కూడళ్లు, పిక్నిక్ స్పాట్లు, ఇలా ఎన్నో పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారికి వినోదం, విజ్ఞానంతోపాటు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతున్నది.

పర్యాటక అభివృద్ధికి కేసీఆర్ సర్కారు కృషి

పర్యాటక అభివృద్ధికి కేసీఆర్ సర్కారు ఎంతో ప్రాధాన్య మిచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లాలో పర్యాటకంగా అనేక అభివృద్ధి పనులు నిర్వహించడంతో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా రూపుదిద్దారు. ముఖ్యంగా మయూరీ హరితవనం (కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు) పిక్నిక్ స్పాట్‌గా రూపుదిద్దుకున్నది. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి శివారులో 2,087 ఎకరాల్లో పచ్చదనం పరుచుకున్న ఈ పార్కు ఆహ్లాదాన్ని పంచుతున్నది. బర్డ్ ఎన్‌క్లోజర్, రెయిన్ ఫారెస్టు, వాటర్‌ఫాల్స్, మాకావ్ ఎన్‌క్లోజర్, స్వాన్ పాండ్, జీప్ సైకిల్, జిప్ లైన్, టోటింగ్, ట్రైర్ వాక్, ఆర్చరీ జోన్, వాల్ క్లైబింగ్, హిల్ వ్యూ పాయింట్, ఫ్లాగ్ పాయింట్, బొమ్మలు తదితర వాటిని ఏర్పాటు చేశారు.

6.80 ఎకరాల్లో మినీ శిల్పారామం

ట్యాంక్ బండ్ సమీపంలో రూ. 13 కోట్ల నిధులతో 6.80 ఎకరాల్లో మినీ శిల్పారామం ఏర్పాటు చేశారు. సువిశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన గ్రీనరీ ఎంతో ఆకట్టుకుంటున్నది. ఆవరణలో స్టాళ్లతోపాటు సమావేశాల కోసం ఆడిటోరియం నిర్మించారు. శిల్పారామం పక్కన రెండు ఎకరాల స్థలంలో రూ.24 కోట్లతో అడ్వెంచర్ గేమ్స్, వాటర్ పార్క్ పనులు టెండర్ దశలో మిగిలిపోయాయి.

అద్భుతం సస్పెన్షన్ బ్రిడ్జి..

మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన తీగల వంతెన (సస్పెన్షన్ బ్రిడ్జి)ను అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించారు. ట్యాంక్ బండ్ నుంచి ఐలాండ్ వరకు రూ.14 కోట్లతో ఈ బ్రిడ్జిని కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించారు. ప్రస్తుత సర్కారు దానిని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. బ్రిడ్జికి అవసరమైన సామగ్రిని దక్షిణ కొరియా నుంచి తెప్పించారు. బ్రిడ్జి పొడవు 850 అడుగులు, ఎత్తు 90 అడుగులు, వెడల్పు ఐదు అడుగులుగా ఉన్నది. బ్రిడ్జిపైకి ఏకకాలంలో 200 మంది పర్యాటకులు ఎక్కి వెళ్లవచ్చు. బ్రిడ్జిని నాలుగు స్తంభాలు, 18 పిల్లర్లతో నిర్మించారు.

కూడళ్లకు నూతన శోభ

నాటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లా కేంద్రంలో రూ.18 కోట్లతో ప్రధాన కూడళ్లు సుందరీకరణ పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ చౌరస్తాలో కప్ సాసర్, నీటితొట్టె ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. అదేకూడలి సమీపంలో సుభాష్ చంద్ర బోస్, గౌతమ బుద్ధుడి విగ్రహాలతోపాటు నీటి ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు. మెట్టుగడ్డ చౌరస్తా సమీపంలో పాలమూరు బ్రాండ్ పిల్లల మర్రి చెట్టు ఆకారం, మన మహబూబ్‌నగర్ సెల్ఫీ పాయింట్‌ను నిర్మించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్మించిన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గాంధీ రోడ్డు పాఠశాల వద్ద వివిధ బొమ్మలు, చెట్టు ఆకారాలను తీర్చిదిద్దారు. క్లాక్ టవర్ చౌరస్తా, జాతీయ నాయకుల విగ్రహాలు, భారీ గడియారాలు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద వివిధ కులవృత్తులను ప్రతిబింబించేలా విగ్రహాలు, ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. పాల్కొండ సమీపంలోని బైపాస్ రోడ్డు చౌరస్తాలో హ్యాండ్ ఫౌంటేన్ అబ్బురపరుస్తున్నది.

పర్యాటక పనులపై నీలినీడలు

జిల్లా కేంద్రంలో పర్యాటక పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ పనుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన పలు పనులు నేడు ప్రశ్నార్థకంగా మారాయి. పాలమూరు జిల్లాకు చెందిన సీఎం రేవంత్ ఇప్పటికైనా ఈ పనులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సోమశిల వద్ద నిర్మించిన కాటేజీలు, కృష్ణానదిలో విహారానికి ఏర్పాటు చేసిన లాంచీ

ప్రకృతి సోయగం సోమశిల

- అద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్ సర్కారు
- కాటేజీల నిర్మాణం.. విహారానికి లాంచీ ఏర్పాటు
- గణనీయంగా పెరిగిన పర్యాటకుల తాకిడి



కొల్లాపూర్, సెప్టెంబర్ 26 : కొల్లాపూర్ మండలంలోని కృష్ణానది తీరానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక శోభను తీసుకొచ్చింది. సమైక్య రాష్ట్రంలో మౌలిక వసతులకు నోచుకోని కొల్లాపూర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కింది. కొల్లాపూర్ మండలంలోని దట్టమైన నల్లమల అటవీ మధ్యలో కృష్ణానది తీరంలో ఉన్న సోమశిల తీరం వెంట కాటేజీలు, హరిత హోటల్ ఏర్పాటు చేయడంతో సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు, కృష్ణానది సోయగాలను ప్రపంచానికి చాటేందుకు భారీ ప్రచారం నిర్వహించింది. దీంతో సోమశిలకు పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. అంతేకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ఏర్పాటు చేయడంతోపాటు సోమశిలకు వెళ్లే దారిలో ఏకో పార్కును కూడా ఏర్పాటు చేసి సఫారీ సౌకర్యం కల్పించింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సోమశిల నుంచి శ్రీశైలం వెళ్లే లాంచీ ఆగిపోయింది. దీంతో దానిని ప్రారంభించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ధన్వాడలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు

పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

పింఛన్.. టెన్షన్

ధన్వాడ/బాలానగర్, సెప్టెంబర్ 26 : 'దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని చందంగా ఉంది ధన్వాడ పోస్టల్ శాఖ అధికారుల తీరు. ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల కోసం నాలుగు రోజుల కిందటే డబ్బులు అందించింది. అయితే పోస్టల్ అధికారులు నిర్లక్ష్యంగా నిత్యం కొద్దిమందికే అందిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ధన్వాడలో వందల సంఖ్యలో లబ్ధిదారులు రావడంతో పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే బాలానగర్ మండలం గుండేడులోని వృద్ధులు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా 5వ తేదీన డబ్బులు అందేవని, ప్రస్తుతం 20 రోజులు దాటినా పింఛన్ చేతికి అందడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 26 : ఎన్నికల ముందు రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జొన్నలబొగుడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుబంధుగా ఉన్న పథకాన్ని రైతు భరోసాగా మార్చినా వానకాలం పోయి యాసంగి సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేయడం లేదన్నారు. పెట్టుబడి సాయం అందక రైతులు అప్పులపాలవుతున్నారని, అదేవిధంగా రుణమాఫీ సైతం అరకొరగా అందించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం, అర్హులకు రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని, లేదంటే రైతుల తరపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని ఆయన ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేశ్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, రాజగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, చంద్రకళ, రవి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి